క్లుప్తంగా

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా బేస్త శాంత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల సమాఖ్య అధ్యక్షురాలిగా గోపాల్‌పేటకు చెందిన బేస్త శాంత ఎన్నికయ్యారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో సోమవారం ఎన్నికల అధికారిణి ప్రసన్నరాణి ఆధ్వర్యంలో మండల సమాఖ్య జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 1995 మ్యాక్స్ చట్టం ప్రకారం మండల సమాఖ్య సభ్యుల ఉపవిధుల గురించి సభ్యులకు అవగాహన కల్పించారు. దీంతోపాటు మండలంలోని 32 గ్రామ సంఘాలలో 2,3 గ్రామసంఘాలను కలిపి ఒక నియోజకవర్గం చొప్పున మండలంలో 9 నియోజకవర్గాలుగా ఏర్పాటు చేశారు. ఒక్కో నియోజకవర్గం నుండి ఒక్కో కార్యనిర్వాహక సభ్యురాలిని ఎన్నుకున్నారు. 9 మంది కార్యనిర్వాహక సభ్యుల నుంచి ముగ్గురు పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వారిలో మండల సమాఖ్య అధ్యక్షురాలిగా బేస్త శాంత, కార్యదర్శిగా నాయికోటి మంజుల(గోలిలింగాల), కోశాధికారిణిగా బోయిని మమత(మాల్తుమ్మెద)ను ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేయించారు. ఐకేపీ ఏపీఎం జగదీశ్ కుమార్, సీసీలు దత్తు, రషీద్, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, సుజాత, అకౌంటెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు సమాఖ్య అధ్యక్షురాలిగా రాజమణి



భిక్కనూరు: మండల సమాఖ్య అధ్యక్షురాలిగా కుమ్మరి రాజమణి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల సమాఖ్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో డీపీఎం సుధాకర్ ఆధ్వర్యంలో మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలితో పాటు కార్యదర్శిగా తొగరి లక్ష్మి, కోశాధికారిగా సునీతలను ఎన్నుకున్నారు. ఐకేపీ ఏపీఎం సాయిలు, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

డోంగ్లీ డిప్యూటీ తహసీల్దార్‌గా శరత్ కుమార్



మద్నూర్: డోంగ్లీ డిప్యూటి తహసీల్దార్‌గా శరత్ కుమార్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డోంగ్లీ తహసీల్దార్ రేణుక చవాన్, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది నూతనంగా నియమితులైన డిప్యూటీ తహసీల్దార్‌కు స్వాగతం పలికారు. మండల ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలు అందిస్తానని డిప్యూటీ తహసీల్దార్ శరత్‌కుమార్ పేర్కొన్నారు.

ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు రక్తదానం

కామారెడ్డి అర్బన్: హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ రోగికి రెండు యూనిట్ల ఓ–పాజిటివ్ రక్తం అవసరం కాగా పట్టణానికి చెందిన కిరణ్, రాజు అనే యువకులు అక్కడి వెళ్లి రక్తదానం చేశారని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఎం.రాజన్న, కార్యదర్శి రఘుకమార్‌లు తెలిపారు. కిరణ్ ఇప్పటికి 60వ సారి రక్తదానం చేయగా, రాజు 24వ సారి రక్తదానం చేశారని అభినందించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలో జాతీయ రహదారి–161పై సోమవారం ఎస్సై మహేందర్ ఆధ్యర్యంలో డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. వాహన చోదకులకు బ్రీత్ అనలైజర్ టెస్టులు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలని అరికట్టేందుకు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నమని తెలిపారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, జైల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులను నియమించాలి

ఎల్లారెడ్డి: బాలికల వసతి గృహాలలో స్టాఫ్ నర్సులను నియమించాలని బీసీ విద్యార్థి సంఘం నాయకులు లింగమయ్య డిమాండ్ చేశారు. ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాల్లో విద్యార్థినులకు ఆరోగ్య సమస్యలు వచ్చిన సమయంలో ఇబ్బందులు పడుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని స్టాఫ్ నర్సులను నియమించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించినట్లు ఆయన తెలిపారు.

క్యాసంపల్లి తండాలో కన్నీటి కష్టాలు

- గుక్కెడు తాగునీటి కోసం తండ్లాట
- సరిపోని మిషన్‌భగీరథ నీళ్లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం





క్యాసంపల్లి తండాలో నల్లా వద్ద నీళ్లు పట్టుకుంటున్న స్థానికులు

కామారెడ్డి రూరల్ : క్యాసంపల్లి తండాలో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొంది. తండాలో ఒకే ఒక్క బోరు ఉండటంతో నీటి కోసం తండ్లాట తప్పడం లేదు. తండాలో సుమారు 250 కుటుంబాలున్నాయి. భూగర్భజలాలు పడిపోయి ఉన్న బోరు నీరు తక్కువగా పోస్తోంది. ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే నీళ్లు వస్తున్నాయి. వచ్చే కొద్దిపాటి నీళ్లను పట్టుకోవడానికి తండావాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న ఒకే ఒక్క బోరు నుంచి తండా అంతటికి రెండు నల్లాలు ఉండడంతో 250 కుటుంబాలకు తాగునీరు దొరకడం లేదు. రోజంతా నీటిని పట్టుకోవడానికే సమయం కేటాయించడంతో ఇతర పనులకు వెళ్లలేకపోతున్నట్లు తండా వాసులు చెబుతున్నారు. మిషన్ భగీరథ పథకం కింద తండాకు సాగు, నీటి సౌకర్యం ఉన్నా నాలుగైదు రోజులకోసారి నీటి సరఫరా జరుగుతోంది. ఈ పథకం కింద ఇంటింటికి నల్లా ఉన్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఇంటికి నాలుగైదు బిందెలు మాత్రమే వస్తున్నాయి. దీంతో స్నానాలు, బట్టలు ఉతకడడానికి, పిల్లలను స్కూల్‌కు పంపడానికి స్నానాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి కోసం వ్యవసాయ భూముల వద్దకు వెళ్తే అక్కడ పంట పొలాలకే నీరు అందడం లేదని రైతులు రానివ్వడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. మార్చి నెలలోనే ఇంత ఇబ్బంది ఉంటే ఏప్రిల్, మే నెలలో తాము ఇంకా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. రానున్న రెండు నెలలను దృష్టిలో ఉంచుకొని తండాలో నెలకొన్న నీటి సమస్యను తీర్చాలని తండా వాసులు కోరుతున్నారు.

పనులు మానుకుంటున్నాం



నీళ్ల కోసం పనులు మానుకుంటున్నాం. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకే బోరు నడస్తది. దీంతో తండావాసులందరం వచ్చే నీళ్ల కోసం ఇబ్బంది పడుతున్నాం. గంటలకొద్దీ నిలబడి నీళ్లు పట్టుకుంటున్నాం. తండాలో నీళ్ల గోస తీర్చాలి.

–వాలి, క్యాసంపల్లి తండా

ట్యాంకర్‌తో సరఫరా చేయాలి



నీళ్ల కోసం గోసైతుంది. ట్యాంకర్‌పెట్టి నీటిని తండాకు అందించాలి. నీళ్ల లేక తానాలకు, బట్టల పిండేందుకు ఇబ్బందైతుంది. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి వాటర్ ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేసి తండాలో నీటి గోస లేకుండా చూడాలి.

–రాధ, క్యాసంపల్లి తండా

బోరు వేయించాలి



తండాకు ఒకే ఒక్క బోరు ఉండటంతో నీళ్ల కోసం ఇబ్బందైతుంది. పొలాల వద్దకు వెళ్తే పొలాలు పారడం లేదని రానిస్తలేరు. ఉన్న బోరు ఎత్తిపోవడంతో వచ్చే సన్నం నల్లా కోసం గంటల తరబడి నిలబడుతున్నాం. మరో బోరు వేయించి నీళ్ల గోస తీర్చాలి.

–రాజి, తండావాసి

ట్రాఫిక్ నియంత్రణకు బొల్లార్డ్స్ ఏర్పాటు



కామారెడ్డిలో రహదారిపై ఏర్పాటు చేసిన బొల్లార్డ్స్

కామారెడ్డి క్రైం : రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పట్టణ పోలీసులు ప్రధాన కూడళ్లు, మూల మలుపుల వద్ద బొల్లార్డ్స్ ఏర్పాటు చేశారు. సిరిసిల్ల రోడ్, కొత్త బస్టాండ్, స్టేషన్ రోడ్, హైదరాబాద్ రోడ్, నిజాంసాగర్ రోడ్, మున్సిపల్ కార్యాలయం, అశోక్‌నగర్ చౌరస్తా, ప్రియా థియేటర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఇటీవల పలు వాహనాలు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో బొల్లార్డ్స్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు అవకాశం ఉంటుందని ట్రాఫిక్ ఎస్సై మహేష్ అన్నారు. 8 ప్రాంతాలలో మొత్తం 200 బొల్లార్డ్స్ ఏర్పాటు చేశామన్నారు.

14న యోగా మట్టి స్నానాలు

కామారెడ్డి అర్బన్: స్థానిక రాంమందిర్ జైహనుమాన్ యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 14న శుక్రవారం ఉదయం హోలీ సందర్భంగా తిమ్మక్‌పల్లి రోడ్డులోని స్విమ్మింగ్ పూల్ వద్ద యోగా, మట్టిస్నానాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు యోగాచార్యులు అంజయ్యగుప్తా, యెల్లంకి సుదర్శన్ గుప్తాలు తెలిపారు. ఆసక్తిగల వారు ముందుగా తమ యోగా కేంద్రంలో సంప్రదించి హాజరుకావచ్చన్నారు.

రైతులు కెపాసిటర్లు బిగించుకోవాలి



ఎల్లారెడ్డి: రైతులు బోరు మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని విద్యుత్ శాఖ డీఈ విజయ సారధి సూచించారు. సోమవారం లక్ష్మాపూర్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలు ఏమైనా వస్తే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. సొంతంగా ఎలాంటి విద్యుత్ పనులు చేయవద్దని అన్నారు. ఏఈ వెంకటస్వామి, రైతులు ఉన్నారు.

ప్రజావాణికి అధికారులు డుమ్మా!

పెద్దకొడప్‌గల్(జుక్కల్): సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి అధికారులు డుమ్మాకొడుతున్నారు. వివిధ శాఖల అధికారులు ప్రజావాణికి హాజరై సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించాలని కలెక్టర్ పలుమార్లు ఆదేశించినప్పటికి అధికారులు పెడచెవిన పెడుతున్నారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి తప్ప మిగితా శాఖలకు చెందిన అధికారులు హాజరుకాలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రతి వారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

తాడ్వాయిలో ఫిర్యాదులు నిల్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ రహీమొద్దీన్ తెలిపారు. తహసీల్దార్ రహీమొద్దీన్, ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఎంఈవో రామస్వామి, ఏవో నర్సింలుతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి



బాన్సువాడలో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

బాన్సువాడ: సావిత్రి బాయి పూలే వర్ధంతిని సోమవారం బాన్సువాడలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేత జుబేర్ మాట్లాడుతూ..సావిత్రి బాయి పూలే మహిళలతో పాటు అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. బీఆర్‌ఎస్ నాయకులు మోచీ గణేష్, ఎర్రవాటి సాయిబాబా, శివ, సూరి, సంజయ్‌యాదవ్, గోపాల్, మౌలాన తదితరులు ఉన్నారు.

బోర్లం గ్రామంలో..

బాన్సువాడ రూరల్: సావిత్రిబాయి పూలే వర్ధంతిని సోమవారం బోర్లంలో నిర్వహించారు. జరుపుకున్నారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.బీఆర్‌ఎస్ నాయకులు మన్నె అనిల్ , సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని మల్లయ్యపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, నాయకులు గోపికృష్ణ, శంకర్, వెంకట్ తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సభ్యత్వ నమోదు



ఎల్లారెడ్డిరూరల్: భిక్కనూర్‌లో భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు సాయిబాబా సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికులు ప్రతి ఒక్కరు సంఘంలో సభ్యత్వం తీసుకుని ప్రభుత్వం ద్వారా చేకూరే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంఘం నాయకులు జయరాజ్, ప్రకాష్, సాయిలు తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రెడ్డిపేట గంగపుత్ర నేతలు

రామారెడ్డి: గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యేగా మొదటి ప్రాధాన్యతను ఇచ్చి పని చేస్తున్నామని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెకంటరమణారెడ్డి అన్నారు. సోమవారం రెడ్డిపేటలో ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామంలో గంగపుత్ర సంఘం సభ్యుల ఆహ్వానం మేరకు గంగామాత విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు వచ్చిన ఎమ్మెల్యేను గజామాలతో సన్మానించారు. గంగపుత్ర సంఘ సభ్యులు, గ్రామస్తులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ

కామారెడ్డిక్రైం: రాజంపేట మండలం తలమడ్లలో ముదిరాజ్ కల్యాణ మండపం భూమిపూజ కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి మండప నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ ముదిరాజ్ సంఘ సభ్యుల ఆహ్వానం మేరకు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంక్షిప్తం

మహిళకు కుట్టుమిషన్ అందజేత

కామారెడ్డి అర్బన్: ఆర్యవైశ్య సంఘం నాయకులు వందనపు శైలేష్‌గుప్తా, ఉప్పల శారదలు మంగళవారం జిల్లాకు చెందిన ఎం. కుమారి అనే యువతికి కుట్టు మిషన్‌ను అందజేశారు. కుట్టు మిషన్ అందజేసిన ఆర్యవైశ్య నాయకులను ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ ఎస్.బాలు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం

కామారెడ్డి క్రైం: రాజంపేట మండలం శివాయిపల్లిలో సోమవారం మల్లారెడ్డి–నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యులు మేఘన, సుప్రియ, ఆర్గనైజర్ వెంకట్, పంచాయతీ కార్యదర్శి అరుణ్, మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం

బీబీపేట: వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. 13 ఏళ్లుగా ప్రజల కోసం వేసవి కాలంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, అంతే కాకుండా సామాజిక కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుంటామని ఫౌండేషన్ సభ్యులు అన్నారు. ఎస్సై ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, సొసైటీ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, కార్యదర్శి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'ప్రపంచ శాంతి'పై వర్క్‌షాప్

కామారెడ్డి అర్బన్: విద్యార్థుల్లో ఉద్యోగ, ఉపాధి నైపుణ్యాలు పెంపొందించడానికి, అంతర్జాతీయ అంశాలపై అవగాహన కోసం కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 'పశ్చిమ ఆసియా, ఉక్రెయిన్ సంక్షోభం–ప్రపంచ శాంతిపై ప్రభావం' అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం కళాశాలలో సెమినార్‌కు సంబంధించిన పత్రాన్ని ఆవిష్కరించారు. సమన్వయకర్తలు విశ్వప్రసాద్, సుధాకర్, అధ్యాపకులు రాములు, చంద్రశేఖర్‌గౌడ్, గౌతమి, రాజ్‌గంభీర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): సోమారంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదేశాల మేరకు ఇంటింటికి తిరుగుతూ చెక్కులను అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు అఖిల్‌రావు, సుధాకర్‌రావు, సంజీవులు, మేకల రాజు, శ్రీధర్, దయాకర్, రమేష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

రామారెడి: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యమని మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి అన్నారు. రామారెడ్డి మండలం మద్దికుంటలో సోమవారం ఎన్ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చిందని ఈసందర్భంగా గుర్తు చేశారు. మాజీ జెడ్పీటీసీ మోహన్ రెడ్డి, రామారెడ్డి మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు బండి ప్రవీణ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు దుంపల బాలరాజు, తోటలింగం, పెండాల నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి నాగరాణి

కామారెడ్డి టౌన్: మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి టి.నాగరాణి అన్నారు. తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్(టీఐటీఏ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. టీఐటీఏ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, ప్రిన్సిపల్ అనిల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కంకర వేశారు.. తారు మరిచారు



బీర్కూర్‌లో కంకర వేసి వదిలేసిన రెండు వరుసల ప్రధాన రహదారి

బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలో రెండు వరుసల రహదారి నిర్మాణ పనులు రెండేళ్లుగా కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మొదటి నుంచి పనులు మందకొడిగా కొనసాగు..తూనే ఉన్నాయి. తిమ్మాపూర్ రోడ్డు నుంచి మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర వేశారు. కంకర పొడితో రోడ్డుపై దుమ్ము లేస్తోంది. ఈ కారణంగా వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీటీ వేస్తే దుమ్ము లేవకుండా ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



దుర్కిలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : దుర్కిలో సోమవారం ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాకారులు పాట రూపంలో ఎయిడ్స్ గురించి వివరించారు. ఎయిడ్స్ రోగులను అంటరాని వారిగా చూడొద్దని, ఎయిడ్స్‌కు నివారణ ఉందని చెప్పారు. కలిసి తిన్నా..పడుకున్నా, స్నేహం చేసినా వ్యాపించదని, కేవలం రక్తం, వీర్యం ద్వారానే వ్యాప్తి చెందుతుందని పాటలు పాడి తెలియజేశారు. వైఆర్‌జీ కేర్ రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్, డీఎంపీ సుధాకర్, నందిని, భావన, కళాజాత బృంద సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మద్నూర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కృషి చేయడంతో మండల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. మండల కేంద్రంలో గాంధీచౌక్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ఫొటోకు పాలతో అభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సాయిలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్, నాయకులు హన్మండ్లు స్వామి, ప్రజ్ఞ కుమార్, తైదల్ రవి, అముల్, కుషాల్, గోపి, స్థానికులు పాల్గొన్నారు.

భగీరథ పంప్ హౌస్, డెయిరీ కళాశాల సందర్శన



కామారెడ్డిలోని డెయిరీ కళాశాల వద్ద విద్యార్థులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా మల్లన్నగుట్ట వద్ద గల మిషన్ భగీరథ పంప్ హౌస్, కామారెడ్డిలోని డెయిరీ కళాశాలను సోమవారం సందర్శించారు. మిషన్‌భగీరథ ప్లాంట్ వద్ద నీరు ఎన్ని అంచెలలో క్లోరినేషన్ జరుగుతుందో వివరించారు. ఒకటి కంటే తక్కువ పీహెచ్ గల వాటర్‌ను తాగడానికి ఉపయోగించాలన్నారు. పాల ఉత్పత్తుల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఆధ్యాత్మికం..

వీరభద్రుడి ఆలయ వార్షికోత్సవం



పిట్లం(జుక్కల్): కంబాపూర్ గ్రామంలోని వీరభద్రుడి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పల్లకి సేవ కార్యక్రమంతో పాటు అగ్నిగుండంలో పాల్గొని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అన్నదానం నిర్వహించారు.

సేవాలాల్, జగదాంబ ఆలయాలలో..



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని గిర్ని, నడిమి, కొనతండాల పరిధిలోని సేవాలాల్, జగదాంబ దేవి ఆలయాల వార్షికోత్సవాలను సోమవారం గిరిజనులు భక్తిశ్రద్ధలతో సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పెళ్లికాని యువతులు సేవాలాల్, జగదాంబ ఆలయానికి నైవేద్యాలను తీసుకు వచ్చి సమర్పించారు. ఆలయం వద్ద పూజారి సమక్షంలో బోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు.

పంచముఖ శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లి గ్రామ పంచముఖ శివాలయంలో సోమవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్యసమాజం ఆధ్వర్యంలో గాయత్రి మహాయాగం

కామారెడ్డి అర్బన్: ఆర్యసమాజం ఆధ్వర్యంలో వచ్చే నెల 27న కామారెడ్డి సరస్వతి విద్యామందిర్ హైస్కూల్ మైదానంలో అష్టోత్తర(108) శత కుండీయ గాయత్రీ మహాయాగం నిర్వహించనున్నట్లు ఆర్యసమాజం అధ్యక్షుడు కంకణాల కిషన్ తెలిపారు. యాగంలో పాల్గొనే ఆసక్తిగల వారు 9000733446, 9948640040 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.